# బంధం

## —కాకాని కమల



**వీధి గుమ్మం ఎక్కి "మాస్టారూ" అంటూ వుత్సాహంగా తలుపు తట్టబోయిన రామచంద్రం ఆగిపోయాడు.**

లోపల్నుంచి పెద్దగా కేకలు, ఘర్షణ పడుతున్నట్టు మాటలు, వాటితోపాటే వెక్కిళ్ళు పెడుతూ సన్నని ఏడుపు వినిపించడంతో తలుపు మీద బలంగా పడబోతున్న చేతిని చప్పున వెనక్కి లాక్కున్నాడు.

"అవసరం అయితే నా గొంతుక్కి ఉరి పెట్టుకుని చావనైనా చస్తాను గాని ఆ రామచంద్రాన్ని మాత్రం పెళ్ళి చేసుకోను. నా పెళ్ళి చెయ్యడానికి మీ దగ్గర డబ్బు లేక పోతే నా కర్మానికి నన్ను ఒదిలెయ్యండి. ఆ మాత్రం నా బతుకు నేను బ్రతగ్గలను. అంతేకాని, మీ స్వార్థంతో ఏదో ఒక రకంగా నా బరువు వదుల్చుకోవాలని నా జీవితాన్ని బలి చెయ్యకండి.

"............"

వెక్కిళ్ళ మధ్యమంజుల ఏడుపు గొంతులో దూకుడుగా అంటున్న మాటలు శూలాల్లా రామచంద్రం గుండెని తాకాయి.

అసహనంగా తల విదిల్చుకుంటూ తలుపు పక్కకి తప్పుకున్నాడు.

ఓర వాకిలిగా తెరిచి వున్న కిటికీ లోంచి లోపలి దృశ్యం కనిపిస్తూంది.

ఇతరుల కుటుంబ విషయాలు చాటుగా వినే కుసంస్కారి కాదు రామచంద్రం కానీ...

వాళ్ళ సంభాషణలో తన పేరు వినిపించడంతో అప్రయత్నంగా కిటికీలోంచి లోపలికి తొంగి చూశాడు.

గదిలో ఒక ప్రక్క విశ్వనాథం మాస్టారూ ఆయన భార్య సుభద్రమ్మగారూ కూతురి తల బిరుసు తనానికి నివ్వెరపోతున్నట్టు శిలా ప్రతిమల్లా నిల్చున్నారు.

కళ్ళనుంచి ధారలుగా కన్నీరు జారిపోతుంటే ఎర్రబడ్డ ముఖంతో మంజుల తల ఎగురవేస్తూ రోషంగా అంటూంది.

"అయినా అసలు ఆ రామచంద్రానికి మాత్రం సిగ్గులేదూ? నల్లగా మొద్దులా వుంటాడు. పైగా కాలుకుంటి. ఆ ముఖానికి పెళ్ళి కావల్సి వచ్చిందా? అదీ నేనే కావల్సి వచ్చానా? నువ్వింత తెల్లగా అందంగా వుంటావు

1-3-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

# రంగనాయకమ్మ రాసిన

## 2 కొత్త పుస్తకాలు!!

### 1) వాడుక భాషే రాస్తున్నామా?

'వాడుక భాషే' రాస్తున్నాం. కానీ, ఇంకా 'ప్రారంభం' లోనే వున్నాం. పాటించవలసిన విషయాలు ఇంకా వున్నాయి.

పేజీలు-208 - ధర - 13/-రూ.లు

### 2) 'తెలుగు' నేర్పడం ఎలా?

తెలుగు ఎలా నేర్పాలో అందరూ కనీసంగా ఏకీభవించే, అందరూ తప్పని సరిగా అనుసరించే మార్గం ఒకటి ఈ పాటికే ఏర్పడి వుందని 'సామాన్యులైన' ఉపాధ్యాయులూ, 'సామాన్యులైన' పిల్లల తల్లిదండ్రులూ అనుకుంటున్నారు కదా? కానీ, 'మేధావులైన' వాచక రచయితలూ, 'మేధావులైన' భాషా వేత్తలూ ఇంకా ఏ మార్గాన్నీ అంగీకరించడం లేదు. ఎవరి 'అంతరాత్మ' ప్రబోధంతో వారు 'నూతన' మార్గాలు కనిపెడుతున్నారు. ఆ నూతన మార్గాలన్నీ చూడండి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో వున్న 18 ఒకటో తరగతి వాచకాల గురించీ, 6 వయోజన వాచకాల గురించీ వివరణ ఇది!

పేజీలు: 410 + 20

ధర - 22/-రూ.లు

ప్రతులకు:

**అరుణా పబ్లిషింగ్ హౌస్**

ఏలూరు రోడ్డు

విజయవాడ - 520 002


కదా ఆకుంటి నల్ల మొద్దుని ఎలా చేసుకుంటున్నావే? డబ్బు చూసి ఆశపడ్డావా? అని నా ఫ్రెండ్స్ అంతా హేళన చేస్తున్నారు. బావిలోకి దూకి చావమంటే సంతోషంగా చస్తాను. అంతే కాని ఆ కుంటి వె...ని మాత్రం పెళ్ళి చేసుకోను."

సుభద్రమ్మ రెండు చేతుల్తో తల బాదుకుంది.

"దరిద్రపు దానా! ఏం చూసుకునే నీకు అహంకారం? నీ అందం చూసి మూర్ఛపోయి అతను నిన్ను పెళ్ళి చేసుకుంటాననడం లేదు"

మంజుల వెక్కిరింతగా అంది.

"మరెందుకట?"

"ఎందుకా? మీ నాన్నగారి మీద వున్న గౌరవంతో అతను ఈ పెళ్ళికి ఇష్టపడ్డాడు. కన్న తండ్రి అంటే నీకు గౌరవం లేకపోయినా విన్నప్పుడు చేరదీసి ఆదరించిన గురువు గారంటే అతనికి వల్లమాలిన అభిమానం, గౌరవం వున్నాయి. అందుకే మన పరిస్థితికి జాలిపడి నిన్ను పెళ్ళి చేసుకుందుకు సిద్ధపడ్డాడు."

మంజుల హేళనగా చెయ్యితిప్పింది.

"ఓయబ్బో... అయితే ఇంకేం? అతనికి నాన్న మీద నిజంగా అంత గౌరవం వుంటే ఏ డబ్బు రూపంలోనో ఆర్థికంగా సహాయం చెయ్యొచ్చు కదా? నన్ను పెళ్ళి చేసుకునే ఉద్ధరించాలా?......................"

అంతే!

మంజుల నోటి మాట పూర్తి కానే లేదు.

అంతవరకూ బోనులో పడ్డ పులిలా అటూ ఇటూ పచార్లు చేస్తున్న విశ్వనాథం మాస్టారు "నోర్ముయ్..." అంటూ గట్టిగా అరిచారు.

మరు క్షణం "ఫెళ్ళు" మన్న శబ్దం ఆ గదిగోడల్లో మార్మోగింది.

"మీరు నన్ను కొట్టినా చంపినా నా నిర్ణయం మారదు. ఆ కుంటి మొద్దు రామచంద్రాన్ని నేను పెళ్ళి చేసుకోను... చేసుకోను... చేసుకోను... అంతే!"

కిటికీలోంచి ఆ దృశ్యాన్ని చూసిన రామచంద్రం గుండె ఝల్లుమంది. సిగ్గుతో అవమానంతో అతనిమనసు కుంగి పోయింది.

తనను తాను అసహ్యించుకుంటున్నట్టు గబగబా రోడ్డు మీదికి వచ్చాడు.

వెనుక నుంచి ఎవరో తరుముతున్నట్టుఅంగకి ఒక అడుగు హెచ్చున వేస్తూ వేగంగా ఇంటికి వచ్చేశాడు.

తుఫాను ముందు సముద్రంలా అతని మనసంతా కల్లోలం అయిపోయింది.

ఆ రాత్రి పడుకుంటే రామచంద్రానికి నిద్ర పట్టలేదు.

కన్ను మూసినా తెరిచినా కంటికి ఏకధారగా కన్నీరు కారుస్తున్న మంజుల రూపమే కళ్ళ ముందు కదులుతూంది.

రామచంద్రంలో ఆత్మవిమర్శ... మొదలయింది.

నిజమే

మంజుల అన్నదాంట్లో తప్పు ఏముంది?

మాస్టారంటే తనకి వల్లమాలిన మమకారం. గౌరవం. అభిమానం...

ఆనాడు ఎంగిలి విస్తరాకులా రోడ్ల మీద తిరిగే తనని మాస్టారు చేరదీసి ఆదరించి అన్నం పెట్టి విద్యాదానం చేసి వుండకపోతే తను ఈనాడు ఎంత అధోగతిలో బతికి వుండేవాడో!

కాని అలాంటి తనని, మట్టి ముద్దలాంటి తనని మాస్టారు మహాశిల్పంగా మలిచి, ఆ శిల్పానికి ప్రాణం పోసి, పూజలందుకునే గద్దెపై కూర్చుండ బెట్టారు.

ఈ రోజు తను మంచి ఉద్యోగం, హోదా, మూడంకెల జీతం, జీపు, నౌకర్లు, సంఘంలో పదవి, పలుకుబడి... ఇవన్నీ వున్నాయంటే దానికి కారణం మాస్టారు పెట్టిన భిక్ష, చేతి చలవ కాక ఇంకేమిటి?

తను మాత్రం ఆయన్ని మరిచిపోలేదు.

ఈ లోకంలో తను ఏకాకి. ఒంటరివాడు. తల్లీదండ్రీ లేని అనాథ. అటువంటి తనకి మాస్టారే తల్లి, తండ్రి, గురువు, స్నేహితుడు, చుట్టం, పక్కం...... అన్నీ ఆయనే అయ్యాడు.

మాస్టారికి నల్గురూ ఆడపిల్లలే. మగపిల్లలు లేరు.

సర్వీసులో వుండగానే ముగ్గురు ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేశారు.

కాని నాల్గవ అమ్మాయి దగ్గరకి వచ్చే సరికి ఆయన పరిస్థితి కుంటుపడింది.

ఉద్యోగంలో రిటైర్ అయ్యారు.

పై ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళకి చేసిన అప్పులు వడ్డీలు పెరిగిపోవడంతో వేరేగత్యంతరం లేక పెన్షన్ అమ్ముకోవల్సి వచ్చింది.

ప్రస్తుతం భుక్తి కోసం పది మంది పిల్లలకి ప్రవైట్లు చెప్పుకొని ఆ కొద్దిపాటి ఆదాయంతోనే జీవితం సాగిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో నాల్గవ అమ్మాయి మంజుల పెళ్ళి సమస్య అయింది.

మంజుల అందంగా వుంటుంది.

డిగ్రీ చదువుకొంటోంది.

కానీ వరకట్నంలేకుండా ఆడపిల్ల పెళ్ళి అయ్యే రోజులు కావు.

సరిగ్గా ఈ పరిస్థితిలో రామచంద్రం ఉద్యోగ రీత్యా ఆ ఊరికి రావడం, విశ్వనాథం మాస్టారి కుటుంబంతో తిరిగి అనుబంధం పెనవేసుకోవడం జరిగింది.

ఎందరినో ఆదరించి అన్నం పెట్టిన మాస్టారు, ఈనాడు తినడానికి లేక ఇబ్బంది పడుతుంటే రామచంద్రం గుండె కరిగింది.

వృద్ధాప్యంతో, అనారోగ్యంతో, ఆర్థికంగా చితికి పోయిన మాస్టారి పరిస్థితి రామచంద్రాన్ని కదిలించింది.

అందుకే కట్న కానుకల ప్రసక్తి లేకుండా మంజుల్ని వివాహం చేసుకుంటానని, వివాహానంతరం పెద్ద దిక్కుగా మాస్టారు, భార్య తన దగ్గరే వుండాలని తన అభిప్రాయం వ్యక్తం చేశాడు.

రామచంద్రాన్ని అల్లుడుగా చేసుకోవడానికి ఆనందంగా అంగీకరించారు మాస్టారు.

"ఠంగ్..."

గడియారం ఒంటి గంట కొట్టింది.

రామచంద్రం మంచంలో అసహనంగా కదిలాడు.

"అతనికి నీ మీద నిజంగా అంత గౌరవం వుంటే ఆర్థికంగా సహాయం చెయ్యొచ్చు కదా? నన్ను పెళ్ళి చేసుకొనే ఉద్ధరించాలా?"

మంజుల మాటలు మనసులో ముళ్ళలా కదలుతున్నాయి.

ఒక సవాల్‌గా హెచ్చరిస్తున్నాయి.

నిజమే.

మంజుల అన్నదాంట్లో మాత్రం తప్పేముంది?

తను నల్లగా వుంటాడు. కాలు కుంటి. చిన్నప్పుడు క్రచెస్ సహాయంతో నడిచేవాడు.

కాని మంచి ఉద్యోగం వచ్చాక జయపూర్ ఫుట్ పెట్టుకున్నాడు. పాంటు వేసికొంటే చెప్తే కాని తెలియదు తన అంగ వైకల్యం గురించి. నిజానికి తన మనసు మంచిదే. వ్యక్తిగా మంచివాడే. కాని ఆడపిల్లలు వరించేలా వుండదు తన రూపం.

ఈ రోజు తను మంచి ఉద్యోగంలో సమాజం గౌరవించే అంతస్తులో వున్నాడు.

మంజుల కాకపోతే తనని వేరే ఏ అమ్మాయి అయినా ఆనందంగా పెళ్ళి చేసుకుందుకు ముందుకు వస్తుంది.

???

మనసు మనసులో అంతర్మథనం!
ప్రతి మనిషికీ దేనికోసమో తపన
పేదవాడు తిండికోసం
మధ్య తరగతి మనిషి రేపటి కోసం
వున్నవాడు తరువాత తరాల కోసం
హద్దులు లేని ఈ స్వార్థపు జీవితాలకు
ప్రశాంతత ఎక్కడ?
సరి సరి
ప్రపంచమే అలా వుంది మరి.
అనునిత్యం ఆకలి మంటలు
మితి మీరుతున్న మాన భంగాలు
కత్తిపోట్లు ఇక లెక్కకే అందవు.
అస్తవ్యస్తంగా వున్న ఈ వ్యవస్థలో
దిక్కుతోచక దిక్కులు చూస్తుంది న్యాయం
'నాదేముంది' అన్నట్లు పరిగెడుతుంది కాలం
దీనికి అంతు ఎక్కడ?
ఇదే నా ప్రశ్న

– వి.ఎల్.ఆనందకుమార్

లేదా తనలాగే అంగ వైకల్యంతో బాధపడే అమ్మాయి ఎవరైనా తనకి తటస్థ పడితే ఆమెని చేసుకుందుకు తనకి అభ్యంతరం లేదు.

తన పెళ్ళి తనకొక సమస్య కాదు.

తను మంజుల్ని పెళ్ళి చేసుకుంటానూ అన్నాడంటే కేవలం మాస్టారి మీద గౌరవంతోటేగాని ఆమె అందం మీద ఆశతో మాత్రం కాదు.

ఈ విషయం మంజులకి ముఖ్యంగా మాస్టారి దంపతులకి తను తెలియ చెప్పాలి.

* * *

ఆ మర్నాడు ఉదయం పదకొండు గంటలు కావస్తోంది.

తన ఛాంబర్‌లో కూర్చుని అర్జంటు లెటర్సు వుంటే చూసుకుంటున్నాడు రామచంద్రం.

సరిగ్గా ఆ సమయంలో "క్రిర్"మని స్ప్రింగ్ డోర్ తెరుచుకుని ప్యూన్ లోపలికి వచ్చి "మీ కోసం ఎవరో వచ్చారు పంపించమంటారా?" అన్నాడు.

కాగితాల్లోంచి తల ఎత్తకుండానే "పంపించు" అన్నాడు.

ప్యూన్ వెనకాల లోపలికి వచ్చిన విశ్వనాథం మాస్టార్ని చూస్తూనే విస్తుపోతూ–"మీరా మాస్టారూ! కూర్చోండి. సాయంత్రం నేనే వద్దామనుకుంటున్నాను మీ ఇంటికి" అన్నాడు ఆదరంగా.

వడిలిపోయిన ముఖంతో పది లంఖణాలు చేసినట్టున్న ఆయన్ని చూస్తూనే లీలగా విషయం గ్రహించుకున్నాడు.

ఏదో చెప్పాలని, చెప్పలేక మథనపడుతున్నట్టు ఇబ్బందిగా కుర్చీలో కూర్చున్న ఆయన్ని చూసి లోలోన నవ్వుకున్నాడు.

"మాస్టారూ! ఏమిటి? ఏదైనా పని మీద వచ్చారా?" అన్నాడు నాందీ ప్రస్తావగా.

విశ్వనాథం మాస్టారు ఒకసారి తలఎత్తి మళ్ళీ దించుకున్నారు.

నెమ్మదిగా గొణుగుతున్నట్టు అన్నారు.

"అవును బాబూ! నే...ను...మం...జుల...–పెళ్ళి...ఇ...ష్టం...లే........"

రామచంద్రం చిరునవ్వు చిందించాడు.

"మాస్టారూ! మీరు అనవసరంగా బాధపడకండి. మీరేం చెప్పాలనుకుంటున్నారో నాకు తెలుసు."

మాస్టారు విస్తుబొయ్యారు.

"తె...తెల్సా?!"

రామచంద్రం తల పంకించాడు.

"అవును. తెల్సు మాస్టారూ. నిన్న సాయంత్రం మీ ఇంటికి వచ్చాను. మా పెళ్ళి విషయంలో మీరంతా ఘర్షణ పడటం, మంజుల అభిప్రాయం అన్ని విన్నాను. కళ్ళారా చూశాను. చాటు నుంచి వినటం పొరపాటే కానీ ఏది జరిగినా అంతా మన మంచికే అనుకుందాం..."

"బాబూ! రామం" మాస్టారి కంఠం ఒణికింది. పాలిపోయిన ముఖంతో నిస్తేజంగా చూశారు.

"ఇందులో మీరు బాధ పడాల్సింది ఏదీ లేదు. మంజుల మాటల్లో కూడా నిజం లేక పోలేదు. చిన్నపిల్ల అయినా నా కళ్ళు తెరిపించింది. ఆమె మనసేమిటో తెల్సుకోకుండా నా నిర్ణయం ప్రకటించటం నా తప్పు. నాకు నిజంగా మీ పట్ల గౌరవం వుంటే వేరే రకంగా మిమ్మల్ని ఆదుకోవచ్చు కదా?"

కూకటి వేళ్ళతో కదిలే మహా వృక్షంలా మాస్టారు చలించిపోయారు.

"మాస్టారూ! మీరు అన్యథా భావించకండి. మీకు నా మీద ఏమాత్రం వాత్సల్యం వున్నా నా మాట కాదనకండి. ప్రస్తుతం నా దగ్గర బ్యాంకులో పాతిక వేలు వున్నాయి. వారం పది

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

రోజుల్లో మరో పదిహేను వేలు సర్దుబాటు చేస్తాను. వెంటనే మంజులకి మంచి సంబంధం చూడండి. వచ్చే నెలలో ఇరవై నాలుగో తేదీన మీరు మా పెళ్ళికి పెట్టిన లగ్నానికే వైభవంగా మంజుల పెళ్ళి ఆమెకి నచ్చిన వ్యక్తితో జరిపించండి. మీకు కొడుకుల్లు లేరు. నాకు తల్లి తండ్రులు లేరు. మన మధ్య ఆ అనుబంధం వుందనే భావిస్తున్నాను. అందుకే నిండు మనసుతో మీకు ఆర్థిక సహాయం చెయ్యాలి అనుకుంటున్నాను. నిజానికి ఇంతకి పది రెట్లు డబ్బు ఇచ్చినా మీరు నాకు చేసిన మహోపకారానికి సరికాదు. మీ ఋణం తీరదు. ఇదంతా కేవలం నా తృప్తి కోసం..."

"బాబూ...రామం..."

"అవును మాస్టారూ! అంతే కాదు. మంజుల పెళ్ళి అయ్యాక మీరు నాకు మాట ఇచ్చినట్టుగా నా దగ్గరే వుండాలి. ఒక మంచి ఋని మాసి నా వివాహం కూడా మీరే జరిపించాలని నా కోరిక!"

దెబ్బతిన్న పక్షిలా విలవిల్లాడారు విశ్వనాథం గారు.

"బాబూ...రామం...నన్ను...నన్ను..." ఏదో చెప్పాలని ఆయన మనసు కొట్టుకుంటూంది.

కానీ కంఠంలోంచి మాట పెకిలి రావటం లేదు.

రామచంద్రం వారిస్తున్నట్లు మృదువుగా అన్నాడు.

"మాస్టారూ! ఒకప్పుడు మీరు అన్నం పెడితేనే నా ఆకలి తీరింది. మీరు డబ్బు ఇస్తేనే నేను పరీక్షకి కూర్చునేవాడ్ని. మీరు బోధిస్తేనే నాకా పాఠాలు అర్థం అయ్యేవి, ఆ రోజులు మీరు మర్చిపోయినా నేను మర్చిపోలేదు మాస్టారూ" అంటూ డ్రాయర్ సొరుగు లాగి చెక్‌బుక్ తీసి పాతిక వేలకి చెక్ రాసి విశ్వనాథం గారి చేతిలో పెట్టాడు.

కళ్ళనిండా నీళ్ళు నిండి జలజలా రాలుతుంటే విశ్వనాథంగారు చప్పున కుర్చీలోంచి లేచి రామచంద్రాన్ని కౌగలించుకున్నారు.

"బాబూ...రామం...నీ ఋ...ణం...రః పేద...బడి...పం...తు..."

రామచంద్రం చిన్నగా నవ్వాడు.

"ఎలా తీర్చుకోగలనని కదా మీ భయం. ఎందుకు తీర్చుకోలేరూ? మాస్టారూ! మీ దగ్గర అపారమైన ధనం వుంది. అది తరగని విద్యాధనం. నాలాగే నా పిల్లలూ మీ శిక్షణలో వున్నతులుగా ఎదిగి పైకి రావాలని నా కోరిక. మాస్టారూ! మరి నా కోరిక తీర్చరా?"

విశ్వనాథంగారి కళ్ళల్లో కోటి కాంతులు వెలిగాయి. ఒక అపూర్వ అనుభూతితో ఆయన కళ్ళు చెమరిస్తుంటే ఉత్తరీయంతో కన్నీరు అద్దుకున్నారు.

"తప్పకుండా రామం. నాకుమాత్రం అంతకంటే కావల్సింది ఏముంది? తప్పకుండా నీ కోరిక తీరుస్తాను బాబూ!" వాగ్దానం చేస్తున్నట్టు తనలో తను ఏదో గొణుక్కుంటు వెళ్ళిపోతున్న మాస్టారికేసి తృప్తిగా చూస్తు వుండిపోయాడు రామచంద్రం.

గుండెల మీంచి కొండంత బరువు దిగిపోయినట్టు మనసు తేలిక పడుతుంటే నిశ్చలంగా కళ్ళు మూసుకున్నాడు.

రెండు వెచ్చటి కన్నీటి ముత్యాలు "రాలనా? వద్దా?" అన్నట్టు అతని కంటి కొసలో కదిలాయి. ●





MAIL TO : NIRLEP DISTRIBUTORS: AURANGABAD-431 005 BOMBAY:TEL. 414 1176, 414 1430. TRADE INQUIRIES SOLICITED.

• Delhi : 732433/4 • Bangalore : 602652 • Ahmedabad : 354605/06/07 • Baroda : 556944 • Surat : 39918 • Patna : 224189 • Lucknow : 247532 • Ajmer : 22247.